సాక్షి విశాఖపట్నం

7

ఆదివారం । 28 । మే । 2023

న్యూస్‌రీల్

బాధితులకు న్యాయసేవలందించాలి



సుదర్శన్ రెడ్డి, నాగిరెడ్డి, దుష్యంత్ రెడ్డిలను సత్కరిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

విశాఖ లీగల్ : బాధితులకు న్యాయం చేసే విధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జె.సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎంలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పబ్లిక్ ప్రాసెక్యూటర్ ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ క్రిమినల్ కేసుల స్థితిగతులను పరిశీలించాలన్నారు. బాధితులకు న్యాయం చేసే విధంగా తమ విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని కోరారు. కీలకమైన కేసుల్లో ఎలా వాదనలు వినిపించాలో సూచించారు. హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ న్యాయ సేవలు కోరుతూ వచ్చిన ప్రతి వ్యక్తికి సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు అదనపు పీపీలు ఎస్. దుష్యంత్ రెడ్డి, ఎం. శ్రావణ్ కుమార్, విశాఖ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు, పోక్సో కోర్టు పీపీ కరణం కృష్ణ, 11వ, రెండో అదనపు జిల్లా కోర్టుల ఏపీపీలు బీవీఆర్ మూర్తి, సీహెచ్ పాపారావు పాల్గొన్నారు.

తోటగరువు ఆలయానికి మంత్రి కారుమూరు సాయం



కమిటీ పెద్దలకు నగదు అందజేస్తున్న మంత్రి కారుమూరు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ

ఆరిలోవ: తోటగరువులో నిర్మాణంలో ఉన్న శ్రీకృష్ణుడి ఆలయాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలసి సందర్శించారు. ఈ ఆలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పెద్దలకు మంత్రి రూ 1.50 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఆలయానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన కమిటీ పెద్దలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ పెద్దలు, సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డీసీపీ కార్యాలయాలకు వీఆర్ ఇన్‌స్పెక్టర్లు

దొండపర్తి: సిటీ వీఆర్‌లో ఉన్న ఆరుగురు ఇన్‌స్పెక్టర్లను డీసీపీ కార్యాలయాలకు, పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అటాచ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.శ్రీనివాసరావు, బి.భాస్కరరావు, బి.వి.జగన్నాథరాజులను డీసీపీ-1కు, జి.దేముడుబాబు, బి.లూధర్‌బాబులను డీసీపీ-2కు, టి.వి.విజయ్‌కుమార్‌ను పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అటాచ్ చేశారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ ఏఈవోగా జగన్‌మోహన్

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ) ఏఈవోగా జగన్‌మోహన్ ఆచార్యులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఈవో రమేష్ తిరుపతి శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి బదిలీ అయ్యారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్ జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఏఈవోగా ఉన్న జగన్‌మోహన్ ఆచార్యులు ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఏఈవో రమేష్‌కు శనివారం టీటీడీ సిబ్బంది, అర్చకులు, కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు వీడ్కోలు పలికారు.

సంతృప్తి స్థాయిలో సేవలు

- ప్రజలు మెచ్చే రీతిలో జగనన్నకు చెబుదాం
- సమస్యల పరిష్కారంలో జీవీఎంసీ భేష్
- మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ



మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు తక్షణం పరిష్కారం చూపుతున్నామని మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో క్రమం తప్పకుండా ప్రతి సోమవారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. అలాగే సోషల్ మీడియా ద్వారా కూడా అర్జీలు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి అధికార యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందన్నారు. అర్జీలు స్వీకరించడం.. అది పరిష్కారం అయిందా? లేదా అన్న విషయం కూడా నేరుగా అర్జీదారులకు ఫోన్ చేసి మరి అడిగే బాధ్యతాయుతమైన ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

టోల్ ఫ్రీ నంబర్ ద్వారా...

జీవీఎంసీలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమమే కాకుండా టోల్ ఫ్రీ నంబరు 1800-4250-0009, www.gvmc.gov.in వెబ్‌సైట్, వాట్సప్ నంబరు 96669 09192, వైజాగ్ స్మార్ట్‌సిటీ మొబైల్‌యాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్టు మేయర్ హరివెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. అలాగే ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నంబర్ 1902 అందుబాటులో తెచ్చిందని, ప్రజలెవరైనా ఈ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు చెప్పుకోవచ్చన్నారు.

టౌన్‌ప్లానింగ్ స్పందన

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. అందుకే ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మేయర్, కమిషనర్ చెప్పారు.

డయల్ యువర్ మేయర్

ప్రతి నెలా రెండు, నాలుగు సోమవారాల్లో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి ముందుగా డయల్ యువర్ మేయర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మేయర్ హరివెంకటకుమారి తెలిపారు. ఫోన్ ద్వారా స్వీకరించిన సమస్యలు, సత్వర పరిష్కారానికై సంబంధిత విభాగాలకు పంపుతున్నట్టు పేర్కొన్నారు. వారం గడిచిన తరువాత స్వయంగా ఫిర్యాదుదారులతో ఫోన్‌లో మాట్లాడి.. సమస్య పరిష్కారం అయిందా? లేదా అనే విషయాన్ని తెలుసుకుంటున్నామని మేయర్ చెప్పారు. 2022 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి 9,702 వినతులు స్వీకరించగా, అందులో 9,583 పరిష్కరించామన్నారు. మిగిలిన 119 వినతులు పరిష్కరించాల్సి ఉందన్నారు.

అర్జీదారుల సంతోషం

గతంలో ఎప్పుడు లేనివిధంగా సమస్య చెప్పుకోగానే పరిష్కారం అభిస్తోందని నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అర్జీ పెట్టుకోగానే.. అధికారుల నుంచి స్పందన వస్తోందని, సమస్య పరిష్కారం అయిందా? లేదా? అనే విషయాన్ని కూడా మేయర్ హరివెంకటకుమారి ఫోన్ చేసి మరి తెలుసుకోవడం పాలనలో బాధ్యతను తెలియజేస్తోందని పలువురు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమ నిర్వహణపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

మధురవాడ ఐటీ పార్కుకు ఐలా హోదా!

- హిల్-4లోని 276 ఎకరాల్లో లేఅవుట్
- అక్కడే అదానీ డేటా సెంటర్
- ఇప్పటికే జీవీఎంసీలో తీర్మానం
- ఇక జీవో విడుదలకు మార్గం సుగమం



మధురవాడ ఐటీ పార్కు

సాక్షి, విశాఖపట్నం: పారిశ్రామిక అభివృద్ధితో పాటు కొత్తగా వివిధ పరిశ్రమలు, ఐటీ సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోంది. ఇందుకవసరమైన చర్యలను శరవేగంగా తీసుకుంటోంది. దీనిలో భాగంగా మధురవాడ ఐటీ పార్కులోని హిల్ నెం.1, 2, 3లకు ఇప్పటికే ఐలా (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) హోదా కల్పించింది. హిల్ నెం.4లో 276 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ ఉంది. రోడ్లు, కామన్ ఏరియా పోను 164 ఎకరాల ప్లాట్ల ఏరియా ఉంది. ఇందులో అదానీ డేటా సెంటర్‌కు ప్రభుత్వం 130 ఎకరాలు కేటాయించింది. ఈ హిల్ నెం.4లోని ఐటీ పార్కుకు కూడా ఐలా హోదా కోసం ఏపీఐఐసీ దరఖాస్తు చేసింది. నిబంధనల ప్రకారం ఐలా హోదాకు సంబంధిత స్థానిక సంస్థ తమకు అభ్యంతరం లేదని కౌన్సిల్‌లో తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఆ మేరకు మధురవాడ ఐటీ పార్కు (హిల్ నెం.4)కు ఐలా హోదాపై ఆమోదం తెలుపుతూ జీవీఎంసీ తీర్మానం కూడా చేసింది. ఈ తీర్మానాన్ని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి పంపించింది. అక్కడ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి వెళ్తుంది. అనంతరం ఆ శాఖ నుంచి జీవో విడుదల కావడం ద్వారా ఐలా హోదా లభిస్తుంది. ఇక ఇదంతా లాంఛన ప్రాయంగానే జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన ఇండస్ట్రియల్ ప్రమోషన్, ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున మధురవాడ ఐటీ పార్కుకు ఐలా హోదా లభించినట్టు తెలిపారు.

ఇవీ ప్రయోజనాలు..

ఐలా హోదా వల్ల పార్కులో ఐటీ సంస్థలను ఏర్పాటు చేసే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, స్థానిక సంస్థకు ప్రయోజనాలు చేకూరనున్నాయి. స్థానిక సంస్థ పరిధిలోని రోడ్లు, వీధి లైట్లు, మంచినీరు, డ్రెయిన్లు వంటి మౌలికసదుపాయాల కల్పనతో పాటు వాటి నిర్వహణ బాధ్యత కూడా ఐలాయే చూస్తుంది. ఐలాకు ఒక కమిషనర్‌ను కూడా నియమిస్తారు. ఐలా హోదా పొందిన పార్కులో ఐటీ సంస్థల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన పాలనాపర వ్యవహారాలు చూడడానికి, సత్వరమే అనుమతులు రావడానికి ప్రత్యేక యంత్రాంగం ఉంటుంది. పారిశ్రామికవేత్తలు అనుమతుల కోసం మునుపటిలా స్థానిక సంస్థ చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్న మాట! ఐటీ పార్కుకు ఐలా హోదాతో మరిన్ని ఐటీ సంస్థల ఏర్పాటుకు వీలవుతుంది.

మహానాడులో మహానటులు

- మహానాడులో ఎన్టీఆర్‌కు క్షమాపణ కోరుతూ తీర్మానం చేయండి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



సాక్షి, విశాఖపట్నం: రాజమండ్రిలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడులో మహానటులున్నారని.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చంద్రబాబు సరికొత్త డ్రామాలకు తెరతీస్తున్నాడని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి వ్యాఖ్యానించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'నా కంటే గొప్ప నటుడు చంద్రబాబు' అని ఎన్టీఆర్ అప్పుడే చెప్పారని ఆమె గుర్తు చేశారు. ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పొడవడమే కాకుండా.. ఆయనపై చెప్పులు వేయించిన చంద్రబాబు.. మహానాడులో శతజయంతి వేడుకలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. మరోవైపు ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు బాలకృష్ణ, హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణరామ్, తారకరత్న ఫొటోలు మహానాడులో కనీసం పెట్టకుండా పరోక్షంగా తీవ్రంగా అవమానించారన్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ ఫొటోలు మాత్రమే పోస్టర్లల్లో ఉన్నాయంటే... ఎన్టీఆర్ కుటుంబంపై చంద్రబాబుకి ఎంత కక్ష ఉందో అర్థమవుతుందన్నారు. చంద్రబాబుకు వెన్నుపోటు పొడిచి టీడీపీని, ముఖ్యమంత్రి పదవిని లాక్కొన్నందుకు రెండు రోజులపాటు నిర్వహించే మహానాడులో ఎన్టీఆర్‌కి క్షమాపణ చెబుతూ మొదటి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. 2014 ఎన్నికల్లో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని, డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేసినందుకు క్షమాపణ చెబుతూ రెండో తీర్మానం చేయాలన్నారు. రాజధాని పేరిట రైతులను మోసం చేసినందుకు.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జాప్యం చేసినందుకు రైతులకు క్షమాపణ చెబుతూ మూడో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టో గురించి మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకి లేదని, గత ఎన్నికల్లో మ్యానిఫెస్టోని ముందు వెబ్‌సైట్‌లో పెట్టి ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు వివరించి క్షమాపణ చెప్పి.. అప్పుడు కొత్త మ్యానిఫెస్టో పెడితే బాగుంటుదని హితవు పలికారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం కుట్రలు.. దొంగ తీర్మానాలు చేసినా జనం టీడీపీని, చంద్రబాబుని నమ్మే పరిస్థితిలో లేరని మండిపడ్డారు.

అమరావతిలో పట్టాల పండగ

అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా.. న్యాయస్థానాలు ద్వారా చంద్రబాబు ఎన్ని ఆటంకాలు సృష్టించినా.. చివరికి పేద ప్రజల సంకల్పమే గెలిచిందన్నారు. అమరావతిలో పట్టాలు అందజేసి పేదల ఇళ్లల్లోకి సీఎం జగన్ పండగ తీసుకొచ్చారన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పట్టాలందించారన్నారు. అమరావతిలో జరిగిన సమావేశానికి హాజరైన జనసందోహాన్ని చూసి చంద్రబాబు తుడుచుపెట్టుకుపోవడం ఖాయమన్నారు. సంక్షేమం, సాధికారతకు నిదర్శనంగా సీఎం జగనన్న పాలన నిలుస్తుందన్నారు. ఒక్క రూపాయి లంచం లేకుండా, అవినీతి జరగకుండా సమర్థవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. అమరావతి రోడ్ల మీద జగనన్న పర్యటిస్తే ప్రజలు పండగ చేసి పరవశించారన్నారు. అమరావతి సభకు మహిళలు నడిచి వస్తుంటే పట్టాల కోసం వస్తున్నట్టు లేదని, మహిళా ద్రోహి చంద్రబాబు మీద దండయాత్రకు వచ్చినట్టుగా ఉందన్నారు.

301 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

- కలెక్టర్ అధ్యక్షతన సమావేశమైన కమిటీ
- పేద రిపోర్టర్లకు హెల్త్‌స్కీమ్ చలానాలు చెల్లించాలన్న సాక్షి ప్రతినిధి
- సీఎస్ఆర్ కింద చెల్లించేందుకు కలెక్టర్ అంగీకారం



సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో వివిధ మీడియా సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న 301 మంది జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రతిపాదనల్ని ఆమోదిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డా.ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన ఆయన ఛాంబర్లో అక్రిడిటేషన్ కమిటీ శనివారం తొలిసారి సమావేశమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోని జర్నలిస్టులు ప్రభుత్వ ఉత్తర్వుల్ని అనుసరించి వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులతో పాటు అవసరమైన ధృవపత్రాల కాపీలను జిల్లా పౌర సంబంధాల కార్యాలయానికి అందజేయాలన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అక్రిడిటేడ్ జర్నలిస్టులకు త్వరలో వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోర్డినేటర్ డా.రాజేష్‌ని ఆదేశించామన్నారు. ప్రధాన పత్రికలు మినహా ఇతర పేపర్లలో విధులు నిర్వహిస్తున్న నిరుపేద రిపోర్టర్లకు జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌కు అవసరమైన చలానా నగదుని చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యుడు, సాక్షి బ్యూరో చీఫ్, కె.రాఘవేంద్రారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ డా.మల్లికార్జున హెల్త్‌స్కీమ్ చలానాల్ని సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా చెల్లించేందుకు అంగీకరించారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులకు ఉమ్మడి విశాఖ జిల్లా మొత్తం ఆర్టీసీ పాస్ చెల్లుబాటు అయ్యేలా చూడాలని కమిటీ సభ్యులు కోరగా.. ఇప్పటికే దానికి సంబంధించిన సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఎస్ఎస్ఆర్‌కే బాబూరావు, చిట్టిబాబు, అనురాధ, డి.రాణి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్, మోహనలక్ష్మి, ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం సత్యనారాయణ, కన్వీనర్, మెంబర్ మణిరామ్ పాల్గొన్నారు.

ఇళ్లు కట్టుకుంటా.. భాష నేర్చుకుంటా..

- 2026లో బిచ్చగాడు 3
- హీరో విజయ్ ఆంటోని
- ఆర్కే బీచ్ వేదికగా సక్సెస్ మీట్



మాట్లాడుతున్న హీరో విజయ్ ఆంటోనీ

బీచ్‌రోడ్డు: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇళ్లు కట్టుకుంటా.. తెలుగు భాష నేర్చుకుంటానని హీరో విజయ్ ఆంటోనీ అన్నారు. బిచ్చగాడు-2 సినిమా సక్సెస్ మీట్‌ను శనివారం బీచ్‌రోడ్డులో నిర్వహించారు. బిచ్చగాడు, బిచ్చగాడు-2 సినిమాలను ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. భవిష్యత్తులో తన చిత్రాల షూటింగ్ తెలుగు రాష్ట్రాల్లో జరుపుతామన్నారు. త్వరలోనే బిచ్చగాడు-3 కూడా తెరకెక్కించనున్నట్టు చెప్పారు. ఈ చిత్రం 2026లో విడుదలవుతుందన్నారు. ఈ సందర్భంగా బిచ్చగాడు 2లోని చెల్లి చెల్లి పాట పాడి ప్రేక్షకులను అలరించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని చిత్ర యూనిట్‌ను అభినందించారు.

జగదాంబ థియేటర్‌లో సందడి

అల్లిపురం/జగదాంబ : శనివారం జగదాంబ థియేటర్‌లో మ్యాట్నీ షో విరామ సమయంలో బిచ్చగాడు-2 చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ బిచ్చగాడుని మించి బిచ్చగాడు-2 విజయవంతం అవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ రెండు సినిమాలు తెలుగులో సూపర్ హిట్లు కావడం ఆనందంగా ఉందన్నారు. డిస్ట్రిబ్యూటర్ సురేష్ మాట్లాడుతూ బిచ్చగాడు-2 సినిమా తమిళంలో కన్నా తెలుగులోనే బాగా విజయవంతం అయ్యిందన్నారు. ఆంధ్రాలోనే అతి పెద్ద థియేటర్ అయిన జగదాంబలో బిచ్చగాడు-2 సినిమా హౌస్‌ఫుల్‌గా నడుస్తోందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోను పూర్వీ పిక్చర్స్ ద్వారా విడుదలైందని తెలిపారు. కథ బాగుంటే హీరో ఎవరైనా సరే సినిమా హిట్ అవుతుందనడానికి ఈ సినిమానే ఉదాహరణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో థియేటర్ అధినేత వి.జగదీష్, మేనేజర్ రాజు, పూర్వీ పిక్చర్స్ అధినేత నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్-2023కు అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జు తెలిపారు. వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/ట్రిబ్యునల్‌లు/భారత ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజ్యాంగ సంస్థలు/చట్టబద్ధమైన సంస్థలు/లోయర్ డివిజనల్ క్లర్క్/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు గ్రూప్ 'సి' పోస్టుల భర్తీ కోసం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష నిర్వహిస్తోందన్నారు. ఈనెల 9వ తేదీన వచ్చిన నోటిఫికేషన్‌లో పూర్తి వివరాలు ఉన్నాయన్నారు. దరఖాస్తులను rrc.nic.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలన్నారు. జూన్ 8 వరకు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆగస్టులో జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 10, తెలంగాణాలో 3 కేంద్రాల్లో పరీక్ష ఉంటుందన్నారు.

అప్పన్నకు ఒక్కరోజే రూ.45 లక్షల ఆదాయం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం ఒక్కరోజే సుమారు రూ.45 లక్షల ఆదాయం లభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. దర్శన టికెట్ల ద్వారా సుమారు రూ.27 లక్షలు, సేవల ద్వారా రూ.70వేలు, ప్రసాదాల విక్రయాల ద్వారా సుమారు రూ.12 లక్షలు, విరాళాల రూపంలో 50 వేలు లభించింది. ఇతర మార్గాల్లో మిగిలిన ఆదాయం సమకూరింది. భక్తులతో దర్శన క్యూలు కిటకిటలాడాయి.

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలకు మార్గదర్శకాలు

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల కోసం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి మార్గదర్శకాలు రూపొందించారు. అన్ని జోనల్ క్యాడర్‌ల ఉద్యోగాలు, ఖాళీలను ఈ నెల 28లోగా సమర్పించాల్సి ఉంది. ఏమైనా ఫిర్యాదులు ఉంటే 31లోగా వివరాలు సమర్పించాల్సి వుంటుంది. జూన్ 1 నుంచి 10 లోపు ఫిర్యాదులు పరిష్కరించడానికి అవకాశం కల్పించారు. వచ్చేనెల 16 నుంచి 20 వరకు జోనల్ కేడర్ ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది.

టైగర్ సందడి



ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో తెల్ల పులి సందర్శకులను అలరించింది. శనివారం తన ఎన్‌క్లోజరులో హుషారుగా తిరుగుతూ కనువిందు చేసింది. రాళ్ల ఎక్కడం, లోతైన ట్రంచ్‌లో దిగడం, అటూ ఇటూ పరుగెత్తడంతో పిల్లలు కేరింతలు కొట్టారు. సందర్శకులు సెల్‌ఫోన్‌లో వీడియోలు, ఫొటోలు తీశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అల్లిపురం (విశాఖ దక్షిణ): స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో విశాఖ మెరుగైన ర్యాంకు సాధనకు అంతా సమష్టిగా పనిచేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చాంబర్లో స్వచ్ఛ సర్వేక్షణ్-2023కు సంబంధించి అంశాలపై అధికారులతో సమీక్షించారు. త్వరలోనే స్వచ్ఛ సర్వేక్షణ్ బృందంలో నగరంలో పర్యటించనుందన్నారు. గత ఏడాది కంటే మెరుగైన ర్యాంకు సాధించేందుకు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసే విధంగా ప్రజలను చైతన్య పరచాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ (యూసీడీ) పాపునాయుడును ఆదేశించారు. అలాగే ప్రజా, సామాజిక మరుగుదొడ్లలో సదుపాయాలు మెరుగ్గా ఉండాలన్నారు. జీవీఎంసీ చేపడుతున్న అభివృద్ధి పనులు, అవగాహన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. వినూత్నమైన ఆకారాలతో వస్తువులు తయారు చేసి పలు పార్కులలో ఏర్పాటు చేయాలన్నారు. ప్లాస్టిక్ వేస్ట్‌తో బీటీ రోడ్లను వేసేందుకు పలు ప్రాంతాలను గుర్తించాలని ప్రధాన ఇంజినీరును కమిషనర్ ఆదేశించారు. ప్రధాన ఇంజినీరు రవికృష్ణ రాజు, అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళికాధికారి సురేష్, ప్రాజెక్టు డైరెక్టర్ (యూసీడీ) పాపునాయుడు, డీడీహెచ్ దామోదర్ రావు, పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్, డీపీవో చంద్రిక, ఏపీఆర్‌ఓ నాగేశ్వరరావు, సీటీసీ, ఎస్‌బీఎం, పీఎంయు బృందాలు పాల్గొన్నాయి.

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ఈ-శ్రమ్

సీతంపేట: అసంఘటిత కార్మికుల సంక్షేమానికి, సామాజిక భద్రతకు చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించిందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.సునీత తెలిపారు. కార్మికులు తమ వివరాలను ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5,82,946 మంది కార్మికులు ఉండగా, కేవలం 1.50 లక్షల మంది మాత్రమే తమ వివరాలను పోర్టల్‌లో నమోదు చేసుకున్నారన్నారు. కార్మికుల నమోదు కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత విభాగాల అధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. అంగన్‌వాడీ సెక్టార్‌లో 10వేల మంది, మిడ్‌డే మీల్స్ విభాగంలో 10వేల మంది, ఆశావర్కర్లు 5వేల మంది, మత్స్యకారులు 50వేల మంది, డ్వామాలో 79వేల మంది, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులలో 10వేల మంది, జీవీఎంసీ పరిధిలో చిరువ్యాపారులు, వలంటీర్లు, ఎస్‌హెచ్‌జీ, రిసోర్స్ పర్సన్లు, వారి కుటుంబాలు 4,89,000 మంది ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరంతా తమ వివరాలు నమోదు చేసుకునేలా కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈశ్రమ్ కార్డు పొందితే రెండు లక్షల ఉచిత ప్రమాద బీమా, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాకు జమ చెయ్యడం జరుగుతుందన్నారు. నమోదు కోసం అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో ప్రత్యేక నమోదు కేంద్రం (సీఎస్సీ) ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈశ్రమ్ నమోదు కోసం ఆధార్ కార్డు , దాంతో అనుసంధానమైన ఫోన్ నంబరు, బ్యాంకు అకౌంట్ పాసు పుస్తకం, నామినీ ఆధార్ కార్డుతో కార్మిక శాఖ కార్యాలయాన్ని గాని, సమీప గ్రామ, వార్డు సచివాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

సూపర్ సీనియర్స్ ఫుట్‌బాల్‌లో గోవా విజయం

విశాఖ స్పోర్ట్స్: సూపర్ సీనియర్స్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో గోవా జట్టు 2-0 గోల్స్ తేడాతో చెన్నై జట్టుపై విజయం సాధించింది. రెండు రోజుల పాటు ఈ పోటీలు రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరగనున్నాయి. గోవా, చెన్నై, కేరళ, తెలంగాణా, హైదరాబాద్, విశాఖ జట్లు పోటీపడుతున్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరగనున్న ఈ పోటీలను శనివారం వాల్తేరు డివిజన్ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు.

బైక్ రేసింగ్‌లో గాజువాక యువకుడికి తృతీయ స్థానం

గాజువాక : తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బైక్ రేసులో గాజువాకకు చెందిన అవినాష్ తృతీయ స్థానం సాధించాడు. 850-1050 సీసీ కేటగిరీలోని 400 మీటర్ల విభాగంలో అతడు ఈ ప్రతిభ ప్రదర్శించాడు. ఈ పోటీల్లో మొదటి, రెండో స్థానాలను ముంబై రేసర్లు సాధించారని అవినాష్ తెలిపాడు. ఈ సందర్భంగా అతడిని కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందించారు.

మహిళల ఆర్థిక సాధికారతే జీ-20 లక్ష్యం



రఘురామ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: మహిళల ఆర్థిక సాధికారత జీ-20 దేశాల లక్ష్యమని, భారతదేశం నేతృత్వంలో జీ-20 దేశాలు ఆ దిశగా కృషి చేస్తాయని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే అన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ), విశాఖ స్టీల్‌ప్లాంట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉక్కు మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 'భారతదేశం జీ-20 ప్రెసిడెన్స్ జీ 20 దేశాలలో మహిళల ఆర్థిక సాధికారత' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భారతీయ విధానాలు మహిళలకు సాధికారత కల్పించడంలో సహాయపడతాయన్నారు. గీతం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధా రఘురామ్ , పీఆర్‌ఎస్‌ఐ విశాఖ చాప్టర్ చైర్మన్ డాక్టర్ మూర్తి, వైస్ చైర్మన్ ఆర్.పి. శర్మ, కార్యదర్శి ఎ. గోవిందరావు, పీఆర్‌ఎస్‌ఐ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ యు.ఎస్. శర్మ పాల్గొన్నారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.